## క్లుప్తంగా

### 14 నుంచి బస్ పాసులు జారీ

రాజంపేట : ఈనెల 14 నుంచి రాజంపేట ఆర్టీసీలో బస్‌పాసులు మంజూరు చేయడం జరుగుతుందని డీఎం రమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బస్సు పాసులు ఫీడింగ్ చేయడం, పాతబస్‌పాసులు సిస్టమ్ నుంచి తొలిగిస్తున్నందున బస్‌పాసుల జారీలో జాప్యం జరుగుతోందన్నారు. ఈనెల 12, 13వ తేదీలలో బస్సుపాసులు జారీ ఉండదన్నారు. విద్యార్థులు ఆర్టీసీకి సహకరించాలన్నారు.

### 320 క్వింటాళ్ల విత్తనకాయలు మంజూరు

వీరబల్లి : మండలానికి 320 క్వింటాళ్లు వేరుశనగ విత్తన కాయలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారిణి స్వాతి తెలిపారు. మొత్తం ఎర్ర విత్తనకాయలే వచ్చాయని చెప్పారు. రైతులు ఈ వేరుశనగ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రైతు తమ పట్టాపాసు పుస్తకం తీసుకొని ఆయా రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తీసుకోవాలని, ఒక బస్తా ధర రూ.1710లు అని తెలియజేశారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం



బోరు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, రూపానందరెడ్డిలు

ఓబులవారిపల్లె : మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అరవ శ్రీధర, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రుపానందరెడ్డిలు బుధవారం పూజలు చేసి ప్రారంభించారు. మండల కేంద్రంలోని ముదినేపల్లి శివశంకరాపురం గ్రామానికి మధ్య దాదాపు రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన పక్కా రోడ్డు పనులను, చిన్నఓరంపాడు, ఎల్లాయపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్లను పైప్ లైన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, రెడ్డయ్య, పున్నాటి వాసుదేవరెడ్డి, నాగినేని రమేష్ నాయుడు, ఈశ్వరయ్య నాయుడు, షేక్ మస్తాన్ వలీ, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రీసర్వేపై అపోహలు వద్దు



శ్రీనివాసులు, కమిషనర్

రాజంపేట : పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న రీసర్వే కొలతలు వల్ల పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం తన చాంబరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు రాజంపేట పట్టణంలో ఉన్న 11473 ఇండ్ల (అసెంస్మెంట్ల) రీ సర్వే చేపడుతున్నామన్నారు. ఆన్‌లైన్ రికార్డుల ప్రకారం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న ఇంటి రికార్డులు కొలతలు సమానంగా ఉన్నాయా? అని తెలుసుకొని, వ్యత్యాసం ఉన్న ఇంటి కొలతలు మాత్రమే సర్వే చేస్తున్నామన్నారు. పట్టణంలో రికార్డుల పరంగా పట్టణంలో చాలా వ్యత్యాసం ఉన్నాయన్నారు. రికార్డులు సరి చేసుకోవడానికి ఈ రీ సర్వేను రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రజల అపోహలను పక్కనపెట్టి ఇంటివద్దకు మున్సిపాలిటీ అధికారులు వస్తే సహకరించాలని కోరారు.

### ప్రతి ఒక్కరూ బీమా పథకాన్ని పొందాలి



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

వీరబల్లి : ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గడికోట ప్రాంతంలో ఎర్రపాపిరెడ్డిగారిపల్లికి చెందిన తుమ్మలూరు రెడ్డయ్య అనే వ్యక్తి ఇటీవల ప్రమాదంలో మృతి చెందడం జరిగిందన్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జీవనజ్యోతి పథకం తీసుకోవడంతో ఆయన భార్య తుమ్మలూరు రెడ్డమ్మకు బుధవారం రెండు లక్షల రూపాయలు చెక్కును బ్యాంకు మేనేజర్ మనోహర్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వసతి గృహాల్లో స్ప్రేయింగ్



స్ప్రేయింగ్ చేయిస్తున్న వైద్య, ఆరోగ్య అధికారులు

రాయచోటి టౌన్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల వసతి గృహాలను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు శుభ్రం చేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం రాయచోటి పట్టణంలోని పలు వసతి గృహాలను శుభ్రపరిచారు. అలాగే గోడలపై అపరిశుభ్రంగా ఉండే వాటిని దుమ్ము ధూళిని కూడా శుభ్రపరిచి స్ప్రేయింగ్ చేశారు. పట్టణంలోని అన్ని వసతి గృహాలకు ఇలాంటి స్ప్రేయింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, రామచంద్ర, వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలి

- రైతన్నల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలి
- ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి





రాయచోటి : జ్యేష్ఠ మాస శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకునే ఏరువాక పౌర్ణమి పండుగ రైతు జీవితానికి ప్రత్యేకంగా నిలుస్తుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పశు సంపదే దైవత్వం. పనిని పూజించడమే సంస్కృతి.. ఎద్దులు, నాగలిని పూజించి, తొలిసారిగా దుక్కి దున్నే పవిత్ర దినమే ఏరువాక పౌర్ణమి అని చెప్పారు. రోహిణి కార్తె ముగిసి, మృగశిర కార్తె వస్తే రైతన్నల్లో కొత్త ఆశలు చిగురిస్తాయని, వర్ష ఋతువు ఆరంభానికి సూచికగా ఈ పండుగ జరుపుకుంటారన్నారు. ఏరువాక పౌర్ణమి కేవలం వ్యవసాయ ప్రారంభమే కాదు ప్రకృతి పట్ల రైతుల ఆరాధనకు నిదర్శనమన్నారు. యూరప్ దేశాల్లోనూ ×మే పాన్‌ౕఅనే పేరుతో పనుల ప్రారంభ వేడుకలు జరుపుకోవడం మన సంస్కృతికి అంతర్జాతీయ గుర్తింపు చాటుతుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పనిచేసిందని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా ఖ్యాతి గడించారని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలి.. దేశం సుభిక్షంగా ఉండాలని, రైతుల జీవితాలలో ఆనందం వెల్లివిరియాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రైతన్నలకు, ప్రజలకు ఆయన హృదయపూర్వకంగా ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

**జగన్ హయాంలో రాయచోటి నియోజకవర్గంలోని రైతులకు జరిగిన లబ్ధి**

- వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఐదేళ్లలో రాయచోటి నియోజకవర్గంలోని రైతులు పొందిన లబ్ధి : రూ.274 కోట్లు
- 2020–21 సంవత్సరాలలో తుపాను ప్రభావంతో రాయచోటి నియోజకవర్గంలో పంటల నష్టపరిహార లబ్ధి : రూ.50 కోట్లు
- 2023లో కరువు వల్ల 14,853 ఎకరాలలో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నందుకు 10,454 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ లబ్ధి : రూ.10 కోట్లు
- వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల లబ్ధి : రూ.6,31,11,066
- వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా ద్వారా ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతుకు వెన్నుదన్నుగా అప్పటి జగన్ ప్రభుత్వం నిలిచిందని శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

# ఆటపాటలతో మానసిక, శారీరక ఎదుగుదల



ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

రాయచోటి టౌన్ : ఆట పాటల ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగదల లభిస్తుందని రాయచోటి ఐసీడీఎస్ అధికారిణి సుగుణ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉన్న ఏపీ మోడల్ ఫౌండేషన్ స్కూల్‌లో ప్రపంచ బాలల ఆటల దినోత్సవ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుగుణ మాట్లాడుతూ ఆట పాటల ద్వారా పిల్లలకు చదువు సులభతరంగా నేర్పవచ్చన్నారు. ఇలాంటి ఆట పాటల ద్వారా చిన్న పిల్లలో సంఖ్యామానం, చదవడం, వ్యాయడం, భాష పరిజ్ఞానం నేర్పించవచ్చని పేర్కొన్నారు. వీరిలో 100 మంది చిన్నారులకు శ్రీ వీరభద్రస్వామి ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ అకాడమిక్ మానటరింగ్ అధికారి సమీవుల్లా, పాఠశాల ఉపాధ్యాయులు సురేంద్ర రెడ్డి, జిల్లా ప్రథమ సమన్వయర్త రాజశేఖర్, సూపర్‌వైజర్ శివసుబ్బమ్మ, మోడల్ స్కూల్ అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు ఓబులమ్మ, అరుణ, మజహర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత దేశ ప్రగతిలో భాగమవ్వాలి



టోర్నీ గెలుపొందిన జట్టుతో నిర్వాహకులు


గాలివీడు : యువత క్రీడారంగంలో రాణించడం ద్వారా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఆవుల నాగభూషణ్ రెడ్డి,గోపనపల్లి సర్పంచ్ చెన్నకేశవరెడ్డిలు పిలుపునిచ్చారు. మండల పరిధి ప్యారంపల్లి గ్రామం వద్ద వీర జవాన్ మురళి నాయక్ సంస్మరణగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో మండల యువత పెద్ద ఎత్తున పాల్గొంది. బుధవారం జరిగిన ఫైనల్‌లో వెంకీ జట్టు, పవన్ జట్టు ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. వెంకీ జట్టు విజేతగా నిలవడంతో నాగభూషణ్ రెడ్డి, చెన్నకేశవరెడ్డిలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో యువత విద్యతోపాటుగా క్రీడలలోనూ పాల్గొని శారీరకంగానూ, మానసికంగానూ ఉల్లాసంగా ఉండాలన్నారు. క్రీడారంగంలో ఉన్నతంగా రాణించగలిగితే దేశం గర్వించగలిగే ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చని చెప్పినారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ చైర్మన్ రమణారెడ్డి, జెసిబి రమణారెడ్డి మండల సోషల్ మీడియా కన్వీనర్ వెంకట్ రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ కన్వీనర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి


గాలివీడు : గాలివీడు మండల పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ఫీజులు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ కోరారు. బుధవారం ఈ మేరకు ఆయన గాలివీడు ఎంఈఓ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు యూనిఫాం, పుస్తకాలు విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నాయన్నారు. కనీసం ఎంఈఓ మాటను సైతం లెక్క చేయని స్థితిలో కొన్ని యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వేలకు వేల రూపాయలు పేద ప్రజల నుంచి

ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. కావున జిల్లా విద్యా ఉన్నతాధికారులు స్పందించి పేద బడుగు బలహీన వర్గాల చెందిన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



బాధ్యతలు చేపడుతున్న నందలూరు తహసీల్దార్



బాధ్యతలు స్వీకరిస్తున్న పుల్లంపేట తహసీల్దార్

నందలూరు : మండల తహసీల్దార్‌గా జి.అమరేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో కడప జిల్లా మైదుకూరు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. పదోన్నతి పొంది నందలూరు మండలానికి తహసీల్దార్‌గా వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ వి.పుల్లారెడ్డి నూతన తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పజెప్పి పుల్లంపేట తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

**పుల్లంపేట తహసీల్దార్‌గా పుల్లారెడ్డి**

పుల్లంపేట : పుల్లంపేట మండల తహసీల్దార్‌గా వి.పుల్లారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నందలూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఉన్నారు. సాధారణ బదిలీలో భాగంగా పుల్లంపేట తహసీల్దార్‌గా బదిలీపై విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అరవింద కిశోర్, ఆర్ఐ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఒంటిమిట్ట తహసీల్దార్‌గా గాడి దామోదర్ రెడ్డి**



దామోదర్ రెడ్డి, ఒంటిమిట్ట తహసీల్దార్

ఒంటిమిట్ట : కడప జిల్లాలో మంగళవారం జరిగిన తహసీల్దార్ల బదిలీలో భాగంగా ఒంటిమిట్ట మండల తహసీల్దార్‌గా బి.మఠంలో పనిచేస్తున్న తహసీల్దార్ డి.దామోదర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా బుధవారం ఒంటిమిట్ట రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా దామోదర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఎ.వెంకట రమణమ్మ ఖాజీపేట తహసీల్దార్‌గా బదిలీ అయిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఒంటిమిట్ట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన దామోదర్ రెడ్డికి రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

**పెనగలూరు తహసీల్దార్‌గా అమరేశ్వరి**



పెనగలూరు తహసీల్దార్‌గా అమరేశ్వరి

పెనగలూరు : పెనగలూరు మండల తహసీల్దార్‌గా ఎస్.అమరేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల డిప్యూటీ తహసీల్దార్‌గా డిప్యుటేషన్‌పై పెనగలూరు మండలానికి వచ్చి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. డిప్యూటీ తహసీల్దార్ హోదాలో ఉన్న ఆమె ప్రమోషన్‌పై తహసీల్దార్‌గా పదోన్నతిపై తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

### వైభవంగా వేంకటేశుడి బ్రహ్మోత్సవాలు



గ్రామోత్సవంలో ఊరేగుతున్న వేంకటేశుడు

చిట్వేలి : మండల పరిధిలోని కెఎస్ అగ్రహారంలో వెలసివున్న మహిమాన్విత క్షేత్రం, శ్రీ భూనీల సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఇందులో బాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి మోహినీ తిరుక్కోలం అలంకారంలో దర్శనమిచ్చారు. తదుపరి స్వామివారిని అగ్రహారం నుంచి చిట్వేలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించారు. అనంతరం రాత్రి గరుడ వాహనంపై స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ధర్మాపురంలో అనాథ శవానికి బుధవారం రాత్రి ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ మండల నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు రాత్రి తొమ్మిది గంటల సమయంలో అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు గాని స్నేహితులు గాని ఎవరూ రాకపోవడంతో సంప్రదాయంగా రైల్వే కోడూరు స్మశానానికి తీసుకువెళ్లి అంత్యక్రియలను జరిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది వెంకట్, వాసా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# మట్టిని కుప్పలుగా వేశారు.. తీయడం మరిచారు



ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కనిపిస్తున్న మట్టి కుప్పలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న మట్టిని గత నాలుగు రోజుల క్రితం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కుప్పగా చేసి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉంచారు. అయితే మట్టిని ఎత్తివేయకపోవడంతో వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలకు ద్విచక్ర వాహనదారులు సైడ్ ఇచ్చేందుకు రోడ్డుకు వారగా వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మట్టిని ఎత్తివేయకుంటే మళ్లీ రోడ్డుపైకి వస్తుందని, మట్టి రోడ్డుపైకి వస్తే ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కిందపడి ప్రమాదం చోటుచేసుకొనే అవకాశాలు ఉంటాయని వాహనదారులు అంటున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గతంలోనూ మట్టిని కుప్పలుగా తోసి ఎత్తివేయకపోవడం వల్ల ఓ వాహనదారుడు ప్రమాదానికి గురై గాయాలపాలైన విషయాన్ని ఈ సందర్భంగా వాహనదారులు గుర్తు చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే మున్సిపల్ అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇరువైపులా కుప్పలుగా వేసిన మట్టిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

# మారెమ్మా.. చల్లంగా చూడమ్మా



ఆకట్టుకున్న చాందినీ బండ్ల ప్రదర్శన



దర్శనమిస్తున్న అమ్మవార్లు

సంబేపల్లె : మారెమ్మ తల్లి చల్లంగా చూడమ్మా.. అంటూ భక్తులు ప్రార్థించారు. మండల పరిధిలోని శెట్టిపల్లె పెద్దబిడికిలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు గ్రామ దేవత ముత్తు మారెమ్మ తల్లి జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల విద్యుత్ అలంకరణలతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.

మొక్కులు తీరిన భక్తులు చాందినీబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని మెరుగుపరుచుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని డబ్ల్యూఎఫ్‌సీ ప్రతినిధులు బృందం ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బాలాజీ త్రిపాటి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గాండ్లపల్లి, కోనంపేట గ్రామాలలో పర్యటించి ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు ప్రభావం, పంటలు దిగుబడి, ఆహార భద్రత, వ్యవసాయ జీవన విధానాలపై మార్పుల ప్రభావం గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభసాటితో పాటు మానవాళి మనుగడకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం మార్గదర్శకాలు ప్రభుత్వం తీసుకోవాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసోసియేట్ కృష్ణమూర్తి, సౌమ్య, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం



రాజంపేట: రక్తదానం చేస్తున్న విద్యార్థులు



చిట్వేలి: 110వ సారి రక్తదానం చేస్తున్న వేణుగోపాల్

రాజంపేట : రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నమాచార్య యూనవర్సిటీ వీసీ డా.సాయిబాబా రెడ్డి అన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.స్వర్ణలత ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రక్త దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేయడానికి ఉత్సాహంతో ముందుకొచ్చారన్నారు. శిబిరంలో 100 మంది రక్తదానం చేశారన్నారు.

**శతాధిక రక్తదాత వేణుగోపాల్**

చిట్వేలి : చిట్వేలికి చెందిన డాక్టర్ దొడ్లవాగు వేణుగోపాల్ 110 పర్యాయాలు రక్తదానం చేసినందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ పురస్కారాన్ని ప్రకటించింది. ఈనెల 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సం సందర్భంగా గుంటూరులో జరిగే కార్యక్రమంలో వేణుగోపాల్ పురస్కారం అందకోనున్నట్లు ఆయన ఇక్కడి విలేకరులకు తెలియజేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ నుంచి పురస్కారం అందుకోవడం గౌరవంగా భావిస్తున్నానన్నారు.

# అంగరంగ వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



వేణుగోపాలస్వామి కల్యాణానికి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు



కల్యాణోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు

పెనగలూరు : పెనగలూరు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి వేణుగోపాలస్వామి, రుక్మిణీ సత్యభామ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గౌనేని కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా ఈ కల్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ జిలకల సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. స్వామి కల్యాణానికి తొమ్మిది మంది వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య, మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు మండలంతోపాటు నందలూరు, చిట్వేలి, రాజంపేట మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**లడ్డూ, వడ పంపిణీ..**

వేణుగోపాలస్వామి కల్యాణానికి వచ్చిన భక్తులకు కాణిపాకం వినాయకస్వామి లడ్డూ, వడ, అలాగే తిరుమల లడ్డూలను వేణుగోపాలస్వామి ఆలయ ట్రస్టు తరపున పంపిణీ చేశారు. 3 వేలు కాణిపాకం వినాయకస్వామి లడ్డూలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. అలాగే కల్యాణానికి వచ్చిన భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

**కొండూరు కుటుంబ సభ్యులు ముత్యాల తలంబ్రాలు సమర్పణ**

రాజంపేట మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ కుమారులు, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డి, వేణుగోపాలస్వామి కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలను తీసుకువచ్చారు. ప్రతి ఏడాది కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు కొండూరు కుటుంబ సభ్యులు తీసుకురావడం ఆనవాయితీగా జరుగుతోంది.

### హామీల అమలు కోసం 23న ఆందోళన

మదనపల్లె : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం జిల్లా అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళీ తెలిపారు. బుధవారం ఆందోళన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల పనులు, రహదారులు, గ్రామాల అభివృద్ధి, టమాట రైతులను ఆదుకోవడం, పరిశ్రమల ఏర్పాటు తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.